ఊహాపథంలో

# ప్రియ బాంధవి

కె. ఆర్. కృష్ణ

రెండు రైలుకమ్మీల ప్రక్కగానూ పోతూన్న ఆ కాలిబాట మూడో రైలుకమ్మీ అని భ్రమింప జేయనూ వచ్చు! నా కాళ్లు రెండూ నా ఆజ్ఞతో నిమిత్తం లేకుండానే నా శరీరాన్ని ఆ బాటవెంబడే మోసుకుపోతున్నయ్. అలా ఎంత దూరం నా దేహం మోసుకుపోబడుతోందో! ఏవో ఏవేవో తలపులు నా మనసునం దుద్భవిస్తున్నయ్. ఇంకా నా కాళ్లు యంత్రాల్లా పనిచేస్తూనే ఉన్నయ్. రైలుకమ్మీల అంతం కనుక్కోవాలనుకున్నయ్ నా కళ్లూ, కాళ్ళు. కాలిబాటకీ, ప్రక్కనున్న రైలుకమ్మీలకీ కూడా ఓ తుదీ మొదలూ కనబడేట్టు లేదు. ఏకాంతంగా, ఆసంధ్యారాగంలో అలా ఆ కాలిబాట వెంబడే వెడుతూ, రైలురోడ్డు కిరుప్రక్కలా కానవచ్చే చక్కని దృశ్యాల్ని చూస్తోంటే ఎంత ముచ్చటగా ఉండేది! అవే దృశ్యాలు మళ్లీ మళ్లీ ఎన్నిసార్లు చూచినా తనివి తీరేది కాదు. అవే దృశ్యాలు నన్నిప్పు డాకర్షించడం లేదు! ఏ సుందర దృశ్యమూ నన్నాకర్షించ లేక పోతోంది; ఆనందింపజేయ లేకపోతోంది. పచ్చని వరిచేలు తమ బరువైన పొట్టలతో గర్వముగా చుట్టూ పరికిస్తూంటే ఆదృశ్యం చూడ్డానికెంత మనోరంజకంగా ఉంటుంది! రకరకాల రంగుల పక్షులు తమ తమ స్వస్థానాలకి తిరుగుముఖం పడ్తున్నాయి. అడుగో, వస్తున్నాడు- నవీన యమధర్మరాజు. ఆ మందంతకీ మంచిగేదెపై ఠీవిగా కూచుని హాయిగా పాడుకుంటూ పోతున్నాడు, ఆ గొడ్ల కాపరి! ఈ దృశ్యం మాత్రం నన్ను కొంచెం కదలించింది. ఆగొడ్లకాపరి దెంత సుఖమైన జీవితం. జీవితాన్నంతటినీ అలా ఆటపాటలతో గడిపేస్తాడు నేనుమాత్ర మెందుకు సుఖంగా ఉండకూడదూ? అసంభవం. ఎలా ఉండగల్ను సుఖంగా? నాయీ హీనమైన క్షీణదశలో! రానురాను జీవితం దుర్భరంగానూ, దుస్సహంగానూ తోస్తోంది. జీవితంమీద విరక్తి పుట్టుకొస్తుందేమో ననే భయంకూడ లేకపోలేదు నాలో. విరక్తి అనే భావాన్ని నాదరి చేరనివ్వకుండా ఉండేందుకే ప్రయత్నిస్తాను. అదృష్టవశాత్తూ, నాపట్టుదల, మనోధైర్యం నన్ను నిరాశావాదిని కాకుండా చేశాయ్. పరిస్థితి విషమించిన కొద్దీ పట్టుదల హెచ్చవుతుంది గాని, నిరాశకు మాత్రం తావివ్వలేను; ఇవ్వను. బ్రతికి సాధించాలనే తత్వం నాది.

రానురాను ఓర్పూ, సహనశక్తీ సన్నగిల్తున్నయ్ నాలో. ఒక్కోసారి ఈలోకం, ఈ సంఘం నా మనోబలాన్నీ సహనాన్నీ పరీక్షింపజూస్తున్నవా అనిపిస్తుంది. ఈ బూటకప్రపంచంలోని స్వార్థసంఘం బలహీనుల్ని మరింత బలహీనుల్నిగా జేసి తన కాలిక్రింద త్రొక్కిపెట్టడానికి సర్వశక్తులా ప్రయత్నిస్తుంది. బలవంతులకీ బలహీనులకీ జరిగే సంఘర్షణలో, సాధారణంగా మధ్యతరగతి మానవుడు నశిస్తాడు. ఈ సంఘం బలవంతు ణ్ణేవిధంగానూ ఎదుర్కోదు. బలవంతుడు చేసే అక్రమాల్నీ, అన్యాయాల్నీ, అవినీతి కార్యాల్నీ వేలెట్టి చూపించ సాహసించే వాడెవడూ ఉండడు. ఇరువురు బలవంతులు కలసి చేయీ చేయీ కలిపి ఒకరిచేష్టల నొకళ్లు అతిఘనంగా పొగడుకుంటారు. అదీ వాళ్ల మర్యాద! అదీ మర్యాదస్తుల లక్షణం! సంఘం అంటే మర్యాదస్తుల కూటమి అని చెప్పుకోవచ్చు- మర్యాదస్తుడెవడు, అమర్యాదస్తుడెవడు అనే ప్రశ్న రావచ్చు. మంచి ధనికుడై యుండి ఓ పదిమందిని వెంటేసుకుని క్లబ్బులకీ, హోటళ్లకీ, బీచిలకీ తిరిగే ప్రతి వ్యక్తీ మర్యాదస్తుడు, గౌరవనీయుడు. బ్యూక్, స్టుడేబేకర్, రోల్సు, ఓల్డ్సు ఇత్యాదికార్లలోనూ, రబ్బర్ టైర్లకుషన్ జట్కాల్లోనూ డాంబికంగా తిరిగే ఘరానావ్యక్తు లందరూ పెద్దమనుష్యులుగా పరిగణింపబడతారు. కాంగ్రెస్ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటినుండీ ఖద్దరుబురఖా వేసుకుని, నల్గురైదుగురు భట్రాయుళ్ళను వెంటేసుకుని, కనుపించిన ప్రతి మనిషిదగ్గరా ఓ హద్దూ పద్దూ లేకుండా కోతలు కోసే గోచీపాతరాయుళ్ళందరూ ఇపుడు పెద్ద మనుష్యులే! ఇంతెందుకు? డాంబికంగా వేషంవేసి, బీదల్ని అన్యాయంగా వంచించి మోసగించే ప్రతి ధనవంతుడూ ఓ మర్యాదస్తుడు, ఓ గౌరవనీయుడు.

తాము పెద్దమష్యులమని చెప్పుకు తిరిగే ఈ ఘరానా ధనికవర్గం తమ ధనాన్నెలా సంపాదిం

చూరో విస్మరిస్తున్నారు. ఎవరి కష్టంతో వీరి ధనలక్ష్మి నలంకరిస్తున్నారో గ్రహించ యత్నించరు. పేదల కండరబలాన్ని రూపాయనోట్లుగా మారుస్తున్నారు. వారి ఒక్కొక్క రక్తపుచుక్క వీరి ధనాగారంలోని ఒక్కొక్క బంగరునాణెం; ఒక్కొక్క చెమటబొట్టు ఒక్కొక్క రూపాయనాణెం. అమాయకప్రజల్ని సర్వవిధాలా పీడించి లక్షలూ, కోట్లూ రూపాయలు కూడబెడ్తున్నా రీ స్వార్థపరులు. డబ్బు! డబ్బు! డబ్బు! ఎంతసేపూ అదే ధ్యాస వీరికి, తనివి తీరని ధనదాహం. వీరి ఆనందం ప్రజల్ని వంచించి ధనం గుంజడంలోనే ఉంది, చచ్చింతర్వాత మీదవేసి తగలెయ్యాలి వెధవడబ్బు!

ఇదంతా ధనికులపై దండయాత్రలా ఉంటుంది. వారిమీది అసూయ, ఈర్ష్యలచే నాకలా అనిపిస్తుందేమో! అలా ఎప్పటికీకాదు. నేను మాత్రం ఒకప్పుడు ధనికవర్గానికి చెందినవాణ్ణి కామా! నేను మాత్రం మంచి మంచి కార్లలో దర్జాగా తిరుగలేదూ! నా దుస్థితి కారణంగా అసూయపడుతున్నానా? కాదు కాదు. ఎన్నటికీ కాదు. నాకూ అసూయకీ భద్రవైరం. ఉచ్చస్థితీ దుస్థితీ, ధనికత్వం పేదరికం అన్నీ అనుభవించాను కనుకనే ధనికుల కుతంత్రాల్నీ, కుట్లనీ అవగాహన చేసుకోగల్గుతున్నానీనాడు. నేనీ దుస్థితికి రావడానిక్కారణం, నేను ధనికుణ్ణయినప్పటికీ స్వార్థపరుణ్ణి కాకపోవడమే! నా ఆస్తి పిత్రార్జితం. ఒకప్పుడు వ్రేళ్లపై లెక్కించవలసిన ధనికుల్లో ఒకణ్ణే. కాని, వారికీ నాకూ ప్రతి చిన్న విషయంలోనూ భేదాభిప్రాయమే. వాళ్లెందుకు జీవిస్తున్నట్టు? ధనార్జనకోసం. డబ్బు! డబ్బు!! డబ్బు!!! అదే వారి జీవితాదర్శం, జీవిత పరమావధీను. కాని నేను జీవించడం ధనార్జనకోసం కాదు, ధనవ్యయంకోసం! నాజీవితమంతా ఆనందంకోసం వ్యయపరుస్తాను. నాకోసం (నాడబ్బుకోసం అంటే మరీ బావుంటుంది) నాచుట్టూ ఎప్పుడూ పది పదిహేనుమంది తిరిగేవారు. పెక్కు సంస్థలకి విరివిగా విరాళాలిచ్చి ప్రోత్సహించాను. అనాథులకాశ్రయమిచ్చాను. బీద విద్యార్థులకి చదువులు చెప్పించాను. ఇల్లానే చేతనైనంతవరకు అందరికీ అన్నివిధాలా సహకరించేవాణ్ణి. అందుకే చాలమంది నన్ను వెర్రిబాగులవాణ్ణనీ, అమాయకుణ్ణనీ అపోహపడేవారు. నాక్షేమంకోరిన నామిత్రులు, నా ధనాన్నంతనీ అపసవ్యంగానూ దుబారాగాను ఖర్చుపెడ్తున్నాననీ, ఆలాచేయడంవల్ల మున్ముందు చాలచిక్కులకి లోనౌతాననీ సలహానిచ్చారు. నాతోనే పుట్టిన నా సోదరమానవులు తిండిలేక మలమల మాడుతూ పస్తులుపడి బాధలుపడుతోంటే కళ్ళారా చూస్తూ పంచభక్ష్యపరమాన్నాలు భుజించలేకపోవడం నా వీక్‌నెస్. వారికి తగు సాయంచేయడం నాధర్మం. నాధర్మాన్ని నెరవేర్చడంలోనే ఉంది నా ఆనందం. అదే నాజీవిత పరమావధి.

అనతికాలంలోనే ఒకదాని తరువాత నొకదానినిగా భూములన్నిటినీ విక్రయించేశాను. కోమల యాగీ చేస్తూనేఉంది, చివరికి పిల్లా ఒకొక్క ఎకరం భూమి కూడా మిగల్చకుండా అన్నీ అమ్మేసి దానధర్మాలు చేస్తున్నాననీ. ఈ దానధర్మాలు వినాశనానికి దారితీస్తాయనీ. ఎవరి సలహాలనీ పాటించలేకపోయాను. నాచేతిలోని ఆఖరు దమ్మిడీ కూడ నాప్రజలకే ఖర్చుపెట్టాను. ఆవిధంగా నా జీవితం దెబ్బతింది, ఆర్థికంగా. నాఇంటికొక్కడూ రావడం మానేశాడు. చివరికి నే నేకాకినైపోయాను. సమాజంలో నాడబ్బు తిని బాగుపడ్డవాళ్లు చాలమందున్నారు. వాళ్లలో ఒక్కడూ నన్నీస్థితిలో 'ఎలాఉన్నావు'అని కుశలప్రశ్న వేశే వాడు లేడు. ఎలా ఉంటాడు? నాదగ్గర డబ్బు లేదుగా! బెల్లం చుట్టూ ఈగలు మూగినట్టు నా చుట్టూ మూగేవారీ పెద్దమనుష్యులు. ఆచోటినుండి బెల్లం తీసేసిన వెంటనే ఎక్కడి ఈగలు అక్కడికే ఎగిరిపోతాయి. డబ్బులేంది దమ్మిడీకి కొరగావురా అబ్బీ అని చెప్తూందిప్పుడు నామనస్సు. లోకంఅంతా స్వార్థంతో నిండిపోయింది. ప్రతి మనిషిలోనూ స్వార్థపరత్వం జీర్ణించిపోయింది, ఎవడి బాగు వాడు చూచుకో ప్రయత్నించేవాడేగాని చెడిపోయేవాణ్ణి బాగుపర్చడాని కెవడూ ప్రయత్నించడు. 'నీళ్ళలో మునిగిపోతున్నానర్రోయ్' అని ఎవడైనా మొరపెట్టుంటే, 'అయ్యో పాపం! మునిగిపోతున్నావా' అనేవాడేగాని కొంచెం చేయి అందించేవా డెవడూ ఉండడు. ఒకవేళ అటువంటివాడెవడైనా ఉంటే వాడే సంఘంలో జీవించడాని కనర్హుడు, అమాయకుడూనన్నమాట!

జీవితంలో నన్ను బాధించిన సంఘటన ఒక్కటే ఒక్కటి! అలా సంభవిస్తుందని కలలో కూడ అనుకోలేదు. కోమల నన్నడిగింది, 'ఇక్కడ తిండి

లేక బాధపడేకంటే మా పుట్టింటికి పోయి సుఖంగా ఉందామా' అని. అందు కంగీకరించలేక పోయ్యాను. వెంటనే తన దృఢ నిశ్చయాన్ని తెలిపింది. నేను తనతో వచ్చినా, రాకపోయినా తను ఆనంద్‌ని తీసుకుని పుట్టింటికి వెళ్తున్నట్టు. ఆశించని ఆమె నిశ్చయం వినేసరికి నా ఆశ్చర్యానికి అంతులేకపోయింది. కొన్ని నిమిషాలవరకూ ఏమి సమాధానం చెప్పలేక పోయాను. ఏదో మాట్లాడాలని ప్రయత్నించాను. కాని ఒక్కమాట కూడా గొంతునుండి బైటికి వెల్వడలేదు. ఏదో చెప్పలేని ఆవేదన హృదయాన్ని నమిలి మింగుతోంది. కిటికీలోంచి బైటికి శూన్యదృక్కులతో చూస్తూ అలానే చాలసేపు నిలుచుండిపోయాను. కోమల నా సమాధానంకోసం కొంతసేపు వేచియుండి, నానుండి సమాధానం రాకపోయేసరికి వెళ్లిపోయిఉంటుంది, మా కుమారుడు ఆనంద్‌తో!

హృదయానికి తీరని గాయం తగిలింది. ఆ గాయంనుండి తేరుకోగలన్నో, లేదోనని భయపడే వాణ్ణి. ఇంట్లో ఒంటిగా కూచుని రోజుల తరబడిని ఏవేవో అర్థంలేని ఆలోచనలతో కాలం గడిపే వాణ్ణి. ఇంతలో నా జీవితంలో మరో వ్యక్తి ప్రవేశించింది. ఓరోజు సాయంత్రం నాగదిలో ఆలోచనా సముద్రంలో ఉన్నాను. కిర్ మనే శబ్దం నాదృష్టిని తలుపుల వైపుకు మరల్చింది. నాశూన్యమైన దృక్కులతో ఆమెవైపు. కాంతామణివైపు తదేక దీక్షగా చూస్తున్నా. ఆమె కళకాంతుల్లేని నా మొహంలోకి చూస్తోంది. ఆమె రాక నన్నాశ్చర్య చకితుణ్ణి చేసింది. వెనుకటి జీవిత పుటల్ని తిరగేస్తోంది నామనస్సు... కాంతామణికి నేనే కన్నెరికం చేశాను. వెనుకటి మా రసవత్తర ఘట్టాలన్నీ జ్ఞప్తికి వస్తున్నయ్. నన్నెంతో గాఢంగా ప్రేమిస్తున్నా ననేది. మనస్సులో శంకించేవాణ్ని. భోగందానికి ప్రేమేమిటని. ఆమె దగ్గరికెళ్లే రోజులలో ఆమె కైదారు లక్షలు విలువచేసే నగలు చేయించాను. కొంతకాలాని కామెపై మక్కువ తగ్గింది. క్రమేణా ఆమె యింటికి వెళ్లడం మానేశాను. ఎన్నో కబుర్లు పంపింది. తన జీవితాన్ని నాశనం చేయవద్దనీ, తన సర్వస్వాన్నీ నాకే అంకితము చేసేననీ ఇలాగే ఇంకా ఇంకా... నేనా కబుర్లేవీ పట్టించుకోలేదు. నే నామె యింటికి రాదలచలేదని నా నిశ్చితాభిప్రాయాన్ని పంపానామెకు. కడసారి ఓ చీటీని పంపింది. నే నెప్పుడు వెళ్ళినా తాను సుస్వాగతం యిస్తానని ఉంది అందులో— నా కళ్లు అశ్రుపూరితా లయ్యాయి. భోగం కులంలో పుడ్తేనేం, కోమలకంటె కాంతామణి వెయ్యిరెట్లు నయం. నిజమైన ప్రేమ ఏదో ఎవరిదో తెలుసుకోలేక పోయాను. అట్టేసేపు కాంతామణి ముఖంలోకి చూళ్లేక పొయ్యాను. ఆమె ముఖంలోకి లేని నవ్వును తెచ్చిపెట్టుకొని నన్ను పల్కరించింది. నన్ను ధైర్యం గొలిపే మాట లెన్నో చెప్పింది. తన ఇంటికి రమ్మని బ్రతిమాలింది. తన యిల్లు నాదే నంది. ఏమీ సందేహించ వద్దంది. తన యింటికి రాలేనన్నాను, పోనీ తనే నా యింటికి వచ్చి ఉంటానంది నా అభ్యంతరం లేకపోతే. దీనికి కూడా కాదనలేకపోయాను.

మళ్ళీ ఏడుస్తోంది లోకం. నేను వచ్చిభోగం దాన్నింట్లో తెచ్చి పెట్టుకున్నాననీ, భోగందాని చేతికూడు తింటున్నాననీ. 'అరే! వంశగౌరవం మంట గలుపుతున్నాడురా' అని ఒకడూ; 'భోగం దాని డబ్బుతో తిండి తినడానికి వీడికెంత సిగ్గు లేదురా' అని, ఒకడూ; 'ఆ భోగందా న్నెలా వల్లోవేశాడురా!' అని ఒకడూ; 'పాపం! ఎలాంటి వాడెలా ఐపోయాడురా! వాణ్ణి చూసినప్పుడల్లా మహాజాలి వేస్తోందిరా' అని సానుభూతి చూపించే వాడొకడూ. ఇలానే తలోకరూ తలోవిధంగా మొదలెట్టారు. ఇన్నిరోజుల్నించీ లేని నాగొడవ ఇప్పుడెందు క్కావల్సొచ్చింది వీళ్లకి? నేను భోజనంలేక మలమల మాడుతోంటే నావైపు కన్నెత్తి చూడని ఈసంఘం, నేను నాశనమౌతూంటే వినోదంగా చూస్తూ ఆనందించిన ఈ సంఘం ఇపుడు నాగురించి శ్రద్ధగా విచారిస్తోంది. నే నెక్కడుంటే వీళ్ళకెందుకు; ఎలాచస్తే వీళ్ళకెందుకూ అని దుగ్ధ. వీరిమాటల్ని నేను లెక్కించను. మొహం ఎదురుగా నవ్వుతూ మాట్లాడి వెనుక వెక్కిరించే సంఘాన్ని నేనెందుకు లక్ష్యపెట్టాలి! 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అనే తరహా మనిషిని నేను. కాంతామణి భోగంది కనుక నీచంగాఉంది వీళ్ళకి, కాంతామణికున్న నీతి నియమాల్లో వెయ్యోవంతు వీళ్ళకీ, వీళ్ళ భార్యా రత్నాలకీ ఉంటే ప్రపంచం బాగుపడును. ఆమె నగలన్నీ అమ్మేసి ఆ ధనంతో వ్యాపారం చేయదలిచాము. అపుడీ సంఘం ఎంత ఏడుస్తుందో చూసి ఆనందించాలి.